# చింత ఎందుకు?

ఏమి తిందుమో యేమి త్రాగుదుమో అని మీ ప్రాణమును గూర్చియైనను,
ఏమి ధరించుకొందుమో అని మీ దేహమును గూర్చియైనను చింతింపకుడి;
ఆహారము కంటె ప్రాణము, వస్త్రముకంటె దేహమును గొప్పవి కావా?
ఆకాశపక్షులను చూడుడి; అవి విత్తవు కోయవు కొట్లలో కూర్చుకొనవు; అయినను
మీ పరలోకపు తండ్రి వాటిని పోషించుచున్నాడు; మీరు వాటికంటె బహు శ్రేష్ఠులుకారా?

మత్తయి 6:25, 26



సి. సూర్య నారాయణ మూర్తి సాక్ష్యము

## ప్రభువు నామమునకే సదా మహిమ కలుగును గాక!

తన రక్తముతో నన్ను కడిగి,

నన్ను నీతిమంతునిగాను, నూతన సృష్టిగాను చేసి


నాకు నిత్య జీవమును అనుగ్రహించిన


ఆ యేసుక్రీస్తుకే ఈ పుస్తకమును,

నా జీవితమును అంకితం చేస్తున్నాను.

యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును.

1యోహాను 1:7






# చింత ఎందుకు?

**ఏమి తిందుమో యేమి త్రాగుదుమో అని మీ ప్రాణమును గూర్చియైనను, ఏమి ధరించుకొందుమో అని మీ దేహమును గూర్చియైనను చింతింపకుడి; ఆహారము కంటె ప్రాణము, వస్త్రముకంటె దేహమును గొప్పవి కావా? ఆకాశపక్షులను చూడుడి; అవి విత్తవు కోయవు కొట్లలో కూర్చుకొనవు; అయినను మీ పరలోకపు తండ్రి వాటిని పోషించుచున్నాడు; మీరు వాటికంటె బహు శ్రేష్ఠులుకారా?**

**మత్తయి 6:25, 26**

**సి. సూర్య నారాయణ మూర్తి సాక్ష్యము**

# చింత ఎందుకు?

ప్రధమ ముద్రణ
**డిశంబర్, 2016**

వివరములకు :

**బ్రదర్. సి. సూర్య నారాయణ మూర్తి,**
**గాంధీ నగర్, హైదరాబాదు**
**ఫోన్ : 90005 12861, 93489 80777**

# క్రీస్తే నిజ రక్షకుడని శ్రమలో తెలిసికొని ఆయన కృపపై ఆధారపడి జీవించుచున్నాను.

**-చింతలపూడి సూర్య నారాయణ మూర్తి, హైదరాబాదు.**

"పర్వతములు తొలగిపోయినను, మెట్టలు తత్తరిల్లినను నా కృప నిన్ను విడిచిపోదు. సమాధాన విషయమైన నా నిబంధన తొలగిపోదు అని నీయందు జాలిపడు యెహోవా సెలవిచ్చుచున్నాడు" యెషయా 54:10

పరిచయము :



ప్రభుని దివ్యచరణాలకు నమస్కరించి స్తుతిస్తూ, యేసు క్రీస్తు నా పట్ల చేసిన అద్భుత కార్యాలు, వాక్యానుసారంగా నేర్పించిన విలువైన పాఠాలన్ని మీకు వివరించు భాగ్యమును బట్టి సంతోషిస్తున్నాను.

నా పూర్తి పేరు చింతలపూడి సూర్యనారాయణ మూర్తి. ఆంధ్రా బ్యాంకులో ఆఫీసరుగా పని చేసి ఇటీవల పదవి విరమణ చేశాను. దేవుని సేవలో నిమగ్నమై ప్రభుని సన్నిధిలో ఆనందిస్తున్నాను. మా తల్లిదండ్రులు విగ్రహారా

ధికులు నేను కూడ చిన్నప్పటి నుండి దేవుడంటే చాలా భయభక్తులలో పెరిగాను. స్కూల్లో చదివే రోజులలో ఎక్కువ ఆసక్తితో "సంపూర్ణ రామాయణం" లాంటి భక్తి సినిమాలు చూచేవాడిని. యుక్త వయసు వచ్చినపుడు ఇంట్లో వాళ్ళందరికంటే ఎక్కువగా పండుగలు ఆచరించేవాడిని. ఒకసారి వినాయక చవితికి మట్టి ప్రతిమను కొనడానికి బజారుకు వెళ్ళాను. ఆ విగ్రహాలు తయారు చేసే వ్యక్తి దగ్గర కుప్పగా పోసిన బంకమట్టితో పాటు విగ్రహ మూస చూచాను. దానిలో మట్టి ఉంచి నేలకేసి కొట్టగానే ఆ విగ్రహము తయారు అయింది. మొదటిసారిగా మనస్సులో చాలా కలత కలిగింది. ఈ విగ్రహాన్నే కదా నేను దేవునిగా పూజించాలి అనే బాధ కలిగింది.

ఇంకా కొంచెం వయసు పెరిగి 20,21 సంవత్సరములు వచ్చేసరికి రెండు సిద్ధాంతాలు నాలో బలంగా నాటుకొని పోయాయి. వాటిలో మొదటిది ఏ పేరున పిలిచినను, మ్రొక్కిననూ ఒకే దేవునికి చెందుతుంది. రెండవదిగా మానవ సేవయే మాధవ సేవ. ఎవరికీ హాని చేయకుండా, సాటి మనిషికి సహాయం చేస్తే తప్పకుండ దేవుని దగ్గరకు వెళ్తాము అనేది!

చదువులో శ్రద్ధ కలిగినందున మంచి మార్కులతో విద్యాభ్యాసం ముగించాను. 19వ సంవత్సరములోనే ఆంధ్రా బ్యాంకులో ఉద్యోగము లభించింది. ఈ దినముల లో నాకు ఒక భయంకరమైన పీడకల వస్తూ ఉండేది. అదేమిటంటే నేను ఒక దారిలో నడుస్తూ ఉండగా ఎదురుగా పాములు కనిపించేవి. కుడికి కాని ఎడమకు కానీ మరలటానికి వీలు లేకుండా అంతటా పాములు కనిపించేవి. ముందుకు సాగే వీలు లేక వెనుకకు తిరిగేవాడిని. వెనుక కూడా అప్పటి వరకు నేను నడచి వచ్చిన దారి అంతా పాములతో నిండి యుండేది. అంతలో రెండు పాములు నా కాళ్ళకు చుట్టుకొనేవి. నేను భయంతో పాములు చుట్టుకుని ఉన్న నా కాళ్ళను ఈడ్చుకుంటు నడవడానికి ప్రయత్నించేవాడిని. అంతలో భయంతో మెళకువ వచ్చేది. ఒళ్ళంతా చెమటలతో నిండి యుండేది. గుండె వేగముగా కొట్టుకునేది. ఈ పీడ కలల గురించి ఎవరితో చెప్పుకోలేదు.

## శారీరక భాధలు - ఆరంభము :

ఉద్యోగములో చేరి ఆనందంగా గడిపే రోజులలో ఆకస్మాత్తుగా వెన్నులో నొప్పి ఆరంభమయింది. డాక్టర్లను సంప్రదించగా బ్యాంకు పని చేసేవారికి వీపు నొప్పి

మామూలే అని చెప్పి నొప్పి తగ్గటానికి టాబ్లెట్లు ఇచ్చి పంపివేశారు. దానికి తోడుగా చాలా ఎక్కువగా తలనొప్పి వస్తూ ఉండేది. ఈ తలనొప్పికి రెండు కారణాలు ఉండేవి
**1. మైగ్రేన్ తలనొప్పి** : ఎండలో బయటికి వెళితే తలనొప్పి వచ్చేది. కొంచెం ఏకాగ్రతతో ఏదైనా పుస్తకం చదివినా తలనొప్పి వచ్చేది.
**2. సైనసైటిస్** : ఎప్పుడు ఒక ప్రక్క ముక్కు భాగం మూసుకుని పోయేది. తలస్నానం చేస్తే తలనొప్పి, ఐస్‌క్రీమ్ తింటే తలనొప్పి. తలనొప్పిగా ఉందని పడుకుంటే నిద్ర లేచేటప్పటికి ఇంకా ఎక్కువయ్యేది. ఇవన్నీ బాధించిననూ ఉద్యోగము శ్రద్ధగా చేస్తూ డిపార్టుమెంటు పరీక్షలలో మంచి ప్రతిభ చూపగా, 24వ ఏట ప్రమోషన్ లభించి 1986వ సంవత్సరములో ముంబాయికి బదిలీ అయింది. ఒక రోజు ఆఫీసులో పని చేయుచుండగా రెండు కాళ్ళు మొద్దుబారిపోయి ఉండడం గమనించాను స్పర్శ లేకుండా పోయింది. ఆ రోజు మొదలుకొని క్రమ క్రమేపీ కాళ్ళలో స్వాధీనము పోవడం ఆరంభమయింది. వెన్నులో ఎక్కడ నొప్పి ఉండేదో అక్కడ వరకు, అరికాలు నుండి భుజములకు కొంచెం క్రింది వరకు స్పర్శపోయింది. తల్లిదండ్రులు, తోబుట్టువులు హైదరాబాదులో ఉన్నారు గనుక వైద్య పరీక్షలు చేయించుటకు ఉద్యోగమునకు సెలవు

పెట్టి ముంబాయి నుండి హైదరాబాదు వచ్చేశాను. చాలా పరీక్షలు చేసిన తరువాత వెన్నెముకకు ఆపరేషన్ చేయాలి అని వైద్యులు నిర్ణయించారు. ఇంకా రెండు రోజులలో ఆపరేషన్ అనగా నేను పూర్తిగా నడక కోల్పోయి మంచం పట్టాను.

1986వ సంవత్సరము సెప్టెంబరు నెలలో గాంధీ ఆసుపత్రిలో వెన్నెముకకు పెద్ద ఆపరేషను చేశారు. ఆపరేషన్ ద్వారా వెన్నెముకలో అడ్డుగా ఏర్పడిన చీమును తొలగించారు. ఆ చీముకు పరీక్ష చేయగా అది ఎముకలలో క్షయ (బోన్ టి.బి.)గా నిర్ధారణ అయింది. ఆపరేషన్ చేసిన డాక్టర్లు 6నెలలు లేదా ఒక సంవత్సరములో నేను బాగవుతానని తిరిగి ఎప్పటిలాగే నడుస్తానని చెప్పారు. కాని నెలలు గడచిపోతున్నా కొంచెం స్పర్శ తిరిగి వచ్చింది కానీ కాళ్ళ మీద స్వాధీనము కొంచెం కూడా తిరిగి రాలేదు. చాలా నిస్పృహ ఆవరించేది, క్షయ వ్యాధి తగ్గింది కాని జరిగిన నష్టము నుండి కాళ్ళ నరములు కోలుకోలేదు.

గాంధీ ఆసుపత్రిలో మూడున్నర నెలలు ఉన్నాను. అక్కడ ఉన్న సమయంలో ఒక నర్సు ఆంటీ నాకు యేసు క్రీస్తు గురించి చెప్పింది కానీ ఆమె చెప్పిన విధానము అస్సలు నచ్చలేదు. మా దేవుళ్ళు మాకు ఉన్నారు, దేవుని

ఏ పేరుతో పిలిచినా ఒక్కటే అని చెప్పి యేసుక్రీస్తును అంగీకరించలేదు. మరియు తాను బైబిలు ఇచ్చినా స్వీకరించలేదు. గాంధీ ఆస్పత్రి నుండి డిశ్చార్జి అయి ఇంటికి వచ్చిన తరువాత ఎవరు ఏ పూజలు చెప్పిననూ ఆ పూజలు శ్రద్ధగా చేసేవారము. జాతకాలు చూపించు కోవడం, గ్రహ శాంతులు చేయడం లాంటివి ఎన్నో చేశాము. తీర్థ యాత్రలు చేశాము. ఎన్ని చేసినా కాళ్ళలో స్వాధీనము రాలేదు. నడక రాలేదు. ఇది ఇలా ఉండగా మా కుటుంబంలో చాలా కలతలు మనస్పర్థలు వచ్చాయి. మా ఇంట్లో ఆరుగురం ఉండేవారము. అమ్మ, నాన్న తమ్ముడు, చెల్లి, అమ్మమ్మ ఉండేవారు. గతంలో చాలా ఆహ్లాదంగా కాలం గడిచేది. కానీ నేను అనారోగ్యం పాలైన తరువాత మా ఇంటిలో శాంతి కరువయింది. మా ఆరుగురిలో ఏ ఇద్దరికి సఖ్యత ఉండేది కాదు. అంతే కాకుండా నాకు భవిష్యత్తును తలచుకుంటే చాలా భయం కలిగేది. ముందు ముందు నన్ను ఎవరు చూసుకుంటారు? నా గతి ఏమిటి అనే ఆలోచనలు చాలా భయపెట్టేవి. జీవితం మీద ఆశ లేకుండా పోయింది. ఎవరైనా విషం ఇస్తే త్రాగి మరణించాలని కోరిక కలుగుతూ ఉండేది. దేవుడు నాకేమి చేయడం లేదనే ఆలోచన ఎక్కువ కాసాగింది. నేను ఏమి పాపము చేశాను? నాకు ఎందుకు

ఈ బాధ రావాలి? ఇంత మంది దేవుళ్ళను ఆశ్రయించినా ఫలితమేమిటి? అసలు దేవుడు లేడు అనే నాస్తిక స్థితికి చేరాను. టి.వి. చూస్తూ, పుస్తకాలు చదువుతూ కాలం గడపాలని నిర్ణయించుకున్నాను. ఈ విధంగా 3 సంవత్సరాలు గడిచిపోయాయి.

**క్రీస్తును గురించి అవగాహన ఆరంభము :**

**"నన్ను వెదకని వారికి నేను దొరకితిని"** (యెషయా 65:1)

1989 నవంబరు నెలలో హైదరాబాదు ఉస్మానియా ఆసుపత్రిలో మళ్ళీ చికిత్స కొరకు చేరాను. అక్కడ మొత్తం మూడు నెలలు ఉన్నాను. నేను విరామ సమయంలో చక్రాల కుర్చీలో కూర్చుని ఆసుపత్రి వార్డు అంతా తిరిగేవాడిని. ఒక రోజు నా ప్రక్క రూమ్‌లో ఉన్న తన కుమార్తె చికిత్స కోసము వచ్చిన మధ్య వయస్కురాలైన ఒక స్త్రీ నన్ను సమీపించి "బాబూ, నిన్ను చిన్న వయసులో చక్రాల కుర్చిలో చూస్తే చాలా బాధ కలుగు తుంది. నీవు ఇప్పటికే చాలా రకాల పూజలు చేసి ఉంటావు. ఒక విషయం చెబుతాను విను. నువ్వు యేసు క్రీస్తుకు కొంత కాలం ప్రార్థించు ఆ తరువాత నీ ఇష్టం" అని చెప్పి తాను ఏవిధంగా యేసు క్రీస్తును నమ్ముకున్నారో వివరించారు. తాను చదువుకుంటున్న దినములలో తన క్లాసు

పుస్తకములో “దేవుడు అంటే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మచ్చరాలను జయించినవాడు” అని వ్రాయబడి ఉండడము చూసి, మరి నేను పూజించే దేవుళ్లలో ఎవ్వరికీ కూడా ఈ లక్షణాలు లేవు కదా అని సంధిగ్ధావస్థలో ఉన్న సమయంలో తనను ఒక స్త్రీ కలిసి “అమ్మా, ఏ లక్షణాలు గల దేవుని కొరకు వెదకుతున్నావో, బలహీనతలకు అతీతుడైన ఉత్తమ లక్షణాలు గల ఆ దేవుడు నీకు ఈ పుస్తకములో దొరుకుతాడు” అని ఆవిడకు బైబిలు బహుమతిగా ఇచ్చింది. ఆ విధంగా ఆవిడ క్రీస్తును తెలుసుకున్నారు. ఆమె పేరు ఝాన్సీరాణి.

ఈ విధంగా తన అనుభవం నాతో పంచుకొని నాకు కూడా బైబిలు చదువమని ఇచ్చారు. యేసు క్రీస్తును వెంబడించిన ఝాన్సీరాణి గారి కుటుంబము ఎంతగానో దీవించబడినారు. ఆ దినములలో నేను చాలా మేగజైన్లు, పుస్తకాలు చదివేవాడిని. ఈ బైబిలు కూడా ఇంకొక పుస్తకము ఇందులో ఏముంటుందో తెలుసుకుందాం. ఇష్టం లేకపోతే మానుకోవచ్చు అనే ఉద్దేశ్యంతో క్రొత్త నిబంధన గ్రంథాన్ని చదువుటకు ఆరంభించాను. యేసుప్రభువు పలికిన మాటలు ఆయన బోధించిన విషయములు నాలో వింతైన మార్పు తేసాగాయి. అప్పటి వరకు నేను పాటించిన

వాటికి, యేసుక్రీస్తు బోధించిన వాటికి చాలా వ్యత్యాసము కనిపించింది.

**ఒక ఉదాహరణ** : గతంలో నన్ను కలువడానికి వచ్చిన వారు “నీ పూర్వ జన్మ కర్మ నీవు అనుభవించక తప్పదు” అని చెప్పేవారు. ఈ మాటలు విన్నప్పుడు నడువలేక మంచం పట్టినటువంటి నాకు ఏ విధంగాను ఉపశమనం దొరుక లేదు. కొంచెం కూడా ఆదరణ కలుగలేదు. సరికదా బాధ ఇంకా ఎక్కువ అయ్యేది. పూర్వ జన్మ ఉన్నదో లేదో తెలియదు. అప్పుడు ఏ పాపము  చేశానో తెలియదు కానీ ఇప్పుడు అనుభవించక తప్పదు అన్న మాటలకు కష్టములో ఉన్న వ్యక్తికి దుఖం ఇంకా ఎక్కువ అవుతుంది. కానీ నేను చదివిన బైబిలు గ్రంథములో యేసుక్రీస్తు ప్రేమతో రోగులను స్వస్థపరిచారు. యేసు రోగులపై చూపిన ప్రేమ, దయ నన్ను చాలా ఆకర్షించాయి. నాకు కూడ క్రీస్తు తప్పక స్వస్థత ఇస్తాడనే ఆశ కలిగింది.

ఒక రోజు నేను తీసుకుంటున్న చికిత్సకు రియాక్షను వచ్చి మూత్రము రావటము ఆగిపోయింది. కడుపు ఉబ్బిపోయి చాలా బాధపడ్డాను. అప్పుడు కాథెటరు ద్వారా మూత్రము బయటకు తీశారు. కానీ ఆ తరువాత నుండి యూరిన్ ఇన్‌ఫెక్షన్ వచ్చింది. ఎన్ని మందులు వాడినా,

ఎన్ని ఇంజక్షన్లు తీసుకున్నా ఆ ఇన్‌ఫెక్షన్ తగ్గలేదు. చాలా భయము కలిగింది. ఎందుకనగా కిడ్నీలు కూడా దెబ్బతింటాయని భయము, ఆందోళన కలిగింది. అప్పటి వరకు పూజ చేసుకునేటప్పుడు నేను దేవుళ్ళుగా నమ్మిన వారికి ఒక్కొక్క శ్లోకము చదువుతూ ఆఖరిలో యేసు క్రీస్తుకు కూడా రెండు ముక్కలు ప్రార్థించేవాడిని. కాని ఇప్పుడు యేసు ప్రభువు ఒక్కరికే మనస్ఫూర్తిగా ప్రార్థన చేశాను. దేవునికి ప్రార్థించిన మరుసటి రోజే ఆ వ్యాధి పూర్తిగా నయం అయింది. యేసుక్రీస్తుకే మహిమ కలుగును గాక! బైబిలులో ఎంతో మంది రోగులను బాగు చేసిన ప్రభువు నన్ను కూడా బాగు చేశారు. అప్పటి నుండి యేసుక్రీస్తు నందు విశ్వాసంలో చాలా బలపడ్డాను. అప్పటి వరకు నవలలు చదివినట్టుగా బైబిలు చదివిన నేను ఇంకా శ్రద్ధతో ఆసక్తితో మరియు ప్రభువును గురించి లోతుగా తెలుసుకోవాలనే ఆశతో చదవడం ప్రారంభించాను.

ఒక రోజు ప్రస్తుతం మా సంఘకాపరి అయినటువంటి సహో. అబ్రహాము కె.డి.యస్ గారి సాక్ష్యము మరియు ఆయన ద్వారా దేవుడు జరిగించిన ఒక అద్భుతమైన స్వస్థత గురించి వివరించబడిన కరపత్రము నా దగ్గరకు వచ్చింది. సహో. అబ్రహాము గారు యేసు క్రీస్తు నామములో ప్రార్థన

చేసినపుడు వెన్నెముక వ్యాధితో చాలా కాలము నుండి నడవలేకపోతున్న ఒక స్త్రీ ఆ క్షణమే బాగుచేయబడి లేచి నడచింది. మా నాన్నగారు ఆ సహోదరుని ఇంటికి వెళ్ళి నా గురించి ప్రార్థించుటకు ఆసుపత్రికి రమ్మని అడిగినపుడు ఆయన వచ్చి యేసుక్రీస్తును గురించి ఆయన సిలువ యాగము గురించి మరియు ఆయన పొందిన గాయముల ద్వారా మనము ఎలా స్వస్థత పొందుతాము అనే అంశము గురించి వివరంగా బోధించి నా కొరకు ప్రార్థన చేశారు తద్వారా యేసు క్రీస్తు నన్ను ఎంతో ఆకర్షించారు.

అటు పిమ్మట మొత్తము 3 నెలలు ఉస్మానియా ఆసుపత్రిలో ఉండి డిశ్చార్జి అయి ఇంటికి తిరిగి వచ్చేశాము. (నాకు అప్పుడు అర్థము కాలేదు గానీ చికిత్స కొరకు ఆసుపత్రిలో జాయిన్ అయిన నా జీవితాన్ని సృష్టికర్త అయిన యేసుక్రీస్తు ఒక అద్భుతమైన మలుపు తిప్పారని) ఇంటికి తిరిగి వచ్చిన తరువాత ప్రతి రోజు కొంచెం సమయం బైబిలు చదివేవాడిని. ఆ తరువాత ఎప్పటిలాగే సినిమాలు చూచేవాడిని. చర్చికి మా నాన్నగారు వెళ్ళనిచ్చే వారు కాదు. క్రైస్తవ సహవాసము లేకపోవడం మూలముగా ఏ మాత్రము ఎదుగు బొదుగు లేకుండా ఒక సంవత్సరము గడిచి పోయింది. పట్టుదలతో ముందుకు సాగడం లేదని

మనస్సాక్షి చేత గద్దించబడినవాడనై ఇంట్లో ఎవ్వరికి తెలియకుండా సహో. అబ్రహాము కె.డి.యస్ గారి ఇంటికి వెళ్ళాను. ఆయన నన్ను గుర్తించి ఆహ్వానించారు. అప్పటి నుండి ప్రతి శనివారము ఆఫీసు నుండి సరాసరి ఆయన ఇంటికి వెళ్ళే వాడిని. సహో. అబ్రహాము గారు నాకు యేసు ప్రభువు గురించి, దైవత్వం గురించి మరియు బైబిలులో లిఖించబడిన సత్యములను గురించి చాలా వివరంగా చెప్పేవారు. యేసుక్రీస్తునందు విశ్వాసంలో ఎంతో బలపడ్డాను. ఆయన నాకు పరవస్తు సూర్య నారాయణ గారి సాక్ష్యము ఉన్న క్యాసెట్లు ఇచ్చారు. పరవస్తు గారు వేదాలు చదివి తెలుసుకున్న సత్యాలు, క్రీస్తును గురించి వేదాలలో వ్రాయబడిన విషయములు గ్రహించిన తరువాత నేను వెళ్తున్న మార్గము సరైనదని, పరలోకము లేదా మోక్షము పొందుకొనుటకు యేసు క్రీస్తు మార్గమని మరియు యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్ర పరుస్తుందని గ్రహించాను. నాకు రక్షణ నిశ్చయత కలిగింది. నమ్మి బాప్తిస్మము పొందుట అవసరమని అర్థము చేసుకొని 1991వ సంవత్సరములో నీటి బాప్తిస్మము పొందాను. నీటి బాప్తిస్మము నా క్రైస్తవ జీవితానికి ఒక మంచి మలుపు. దేవునితో సహవాసమును అనుభవ పూర్వకముగా తెలుసుకున్నాను. దేవుడు మనతో

మార్గమటము అంటే ఏమిటో గ్రహించాను. బాప్తిస్మము తరువాత నా మనో నేత్రములు వెలిగింపబడి పరిశుద్ధ గ్రంథమును ధ్యానించినపుడు ఆత్మీయ సత్యాలు తేట తెల్లమవ్వసాగాయి. పరిశుద్ధాత్మ అను వరమును పొందుకున్నాను. బాప్తిస్మము తీసుకున్న తరువాత కాళ్ళకు పాములు చుట్టుకోవడం వంటి పీడ కలలు ఎప్పుడూ రాలేదు. నేను వెళ్ళవలసిన దారిలోని పాములను ప్రభువు సంహరించి నా మార్గమును సరాళము చేశారు. దయ్యముల ప్రభావం నుండి దురాత్మల నుండి యేసుక్రీస్తు నన్ను విడిపించారు. నాకు వచ్చిన ఆ టి.బి. వ్యాధి చాలా చెడ్డది మరియు నా శరీరంలో బాగా ముదిరిపోయింది. సైతాను కలిగించిన మరణాపాయము నుండి దేవుడు నన్ను కాపాడారని నేను విశ్వసిస్తున్నాను.

ఒకసారి నాకు తల్లిదండ్రులకు మధ్య పెద్ద తగాదా జరిగింది. నేను కలత చెందిన మనస్సుతో ఒక మూలకు వెళ్ళిపోయి దేవుని వాక్యమును ఊరట కొరకు చదవడం ఆరంభించాను. అప్పుడు దేవుడు ఈ విధంగా మాట్లాడారు.

**"భూదిగంతముల నుండి నేను పట్టుకొని దాని కొనల నుండి పిలుచుకొనిన వాడా నీవు నా దాసుడవనియు నేను నిన్ను ఉపేక్షింపక ఏర్పరచుకుంటి ననియు నేను నీతో**

**చెప్పియున్నాను, నీకు తోడై యున్నాను. భయపడకుము నేను నీ దేవుడనైయున్నాను, దిగులుపడకుము నేను నిన్ను బలపరతును, నీకు సహాయము చేయువాడను నేనే. నీ మీద కోపపడినవారందరు సిగ్గుపడి విస్మయ మొందెదరు.**" (యెషయా 41:9-13)ఈ వాక్య భాగము చదువుతున్నప్పుడు దేవుడు దానిని ఆ క్షణమే నా కొరకే వ్రాయించినారా! అనిపించింది. కృంగిపోయి ఉన్న నన్ను ఎంతో ఆదరించారు. ముఖ్యముగా ప్రభువు నన్ను యేర్పరచుకున్నారు అనే విషయము, తన దాసునిగా నన్ను చేసుకున్న విషయము ఎంతో గొప్పది. భూదిగంతముల వరకు సాక్షిగా ఉండగలనని మా పాస్టరు గారి ద్వారా ప్రవచన వాక్యమును ప్రభువు అనుగ్రహించారు.

2016 మార్చి 21వ తేదిన ప్రపంచమంతటా ఉన్న క్రైస్తవులు యేసు క్రీస్తు యొక్క సిలువ మరణము మరియు పునరుత్థానమును జ్ఞాపకము చేసుకొనే గుడ్ ఫ్రైడే, ఈస్టర్ సండే పండుగ దినములలో అమెరికాలో ఉంటున్న నా స్నేహితుని భార్యయైన బాలాగారి ద్వారా పరిచయమైన సహోదరి జయశీలగారి ప్రేయర్ సెల్‌లో ఆడియో రికార్డింగు ద్వారా నా సాక్ష్యము పంచుకొను భాగ్యము కలిగింది. వీరి ద్వారా నా సాక్ష్యము కంప్యూటరులో

రికార్డు చేయబడి భూదిగంతముల వరకు అనేకులకు చేర్చబడింది. సాక్ష్య సేకరణలో దైవచిత్తానికి లోబడి పని చేస్తున్న శ్రీమతి గ్రేస్ విజయ ఆంటీ ద్వారా ఈ పుస్తకము లో నా సాక్ష్యము ప్రచురించు ధన్యత లభించింది. ఈ విధంగా 1991 లో పాస్టరు అబ్రహాము గారి ద్వారా ఇవ్వబడిన దేవుని వాక్కు నా జీవితంలో నెరవేరింది. యేసు క్రీస్తుకే సదా స్తుతి మహిమ కలుగును గాక. సహో. బాలా గారికి, సహో. జయశీల గారికి మరియు గ్రేస్ విజయ ఆంటీ గారికి ఎంతగానో కృతజ్ఞతలు తెలియజేయు చున్నాను. ప్రభువు వారికి నూరంతలు ప్రతిఫలము అనుగ్ర హించును గాక. అమెరికాలో తెలుగు విశ్వాసులు అనేకుల సాక్ష్యములను ఆడియో ద్వారా ఎంతోమంది ఎన్నో దేశము లలో వినగలిగేటట్లు చేస్తున్న దేవుని ప్రత్యేక ప్రణాళికను బట్టి దేవుని స్తుతిస్తున్నాను.

ఆదివారము నాడు యేసుక్రీస్తు మందిరములో జరిగే ఆరాధనకు మా నాన్నగారు నన్ను వెళ్ళనిచ్చేవారు కాదు. ఆ ఆటంకము తొలగిపోవాలని చాలా ప్రార్థించేవాడిని. ఆ దినములలో మా నాన్నగారికి హైదరాబాదు నుండి విజయవాడ బదిలీ అయింది. దానిని రద్దు చేయించు కొనుటకు చాలా ప్రయత్నము చేసారు కానీ వీలు కాలేదు.

1991-92లో నాన్నగారు విజయవాడ వెళ్ళి పోయారు. ప్రభువు కృప వలన ఆ మరుసటి ఆదివారము నుండి నేను మందిరములో జరిగే ఆరాధనకు వెళ్ళసాగాను. 1992- 93లో క్రిస్టమస్ పండుగ వేడుకలలో మా సంఘ పాస్టరుగారి ద్వారా క్రమము తప్పకుండా ఆరాధనకు వచ్చినందుకు బహుమతి అందుకొని క్రీస్తు యేసు యొక్క మహిమను మరొక సారి నా జీవితంలో అనుభవించాను.

**నేను నమ్మిన సిద్ధాంతములు నన్ను పరలోకమునకు తీసుకొని వెళ్ళలేవని దేవుని వాక్యం ద్వారా గ్రహించుట :-**

గతంలో నేను నమ్మిన సిద్ధాంతములలో మొదటిది: 'ఏ పేరుతో పిలిచినా దేవుడు పలుకుతాడు' అనేది ఈ నా నమ్మకము సరైనది కాదని బైబిలు చదువుచున్నప్పుడు ఈ క్రింది వచనముల ద్వారా ప్రభువు నాకు ఋజువు చేసారు.

**"తన్ను ఎందరు అంగీకరించిరో వారికందరికీ అనగా తన నామమునందు విశ్వాసముంచిన వారికి దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను"** (యోహాను 1:12)

ఇక్కడ యేసు ప్రభువు 'తన్ను ఎందరు అంగీకరించిరో' అని చెప్పి వదిలి వేయకుండా 'తన నామము నందు

విశ్వాసముంచిన వారికి' అని వక్కాణించి చెప్పారు. ఆయన పిల్లలము అవ్వాలంటే ఆయన నామమును తెలిసికొని విశ్వసించాల్సిన అవసరము ఉంది అంతేకదా! నన్ను ఎవరైనా పిలవాలి అంటే నా పేరుతో పిలిస్తేనే పలుకు తాను. ఎదో ఒక పేరుతో పిలిస్తే పలుకను గదా! అదే విధంగా సృష్టికర్త అయిన దేవునికి ఒక నిర్దిష్టమైన నామము కలదు. ఆ నామములోనే మనకు పరలోక ప్రాప్తి.

అపో. కా 4:12లో ఈ విధంగా వ్రాయబడింది : **"మరి ఎవని వలనను రక్షణ కలుగదు ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని ఆకాశం క్రింద మనుష్యులలో ఇవ్వ బడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము"**.

యోహాను 14:6లో యేసు ప్రభువు **"నేనే మార్గమును, సత్యమును, జీవమును నా ద్వారానే తప్ప ఎవడును తండ్రి యొద్దకు రాడు"** అని సెలవిచ్చారు. మన యొక్క దైనందిన జీవితంలో ప్రతి విషయములో మనము నిర్దిష్టముగా ఉంటాము కానీ దేవుని విషయము వచ్చేటప్పటికి ఏదైనా పర్వాలేదు అంటాము. ఎప్పుడైనా సత్యము నిర్దిష్టముగా ఉంటుంది.

**నేను నమ్మిన రెండవ సిద్ధాంతము:** 'మానవ సేవయే

మాధవ సేవ' అనగా ఇతరులకు సహాయ పడగలిగితే దేవునికి చేసినట్టే అనియు, దేవుడు ప్రతిఫలమిస్తాడనియు నమ్మాను. అయితే పరిశుద్ధ గ్రంథములో దేవుడు ఈ విధంగా వ్రాయించారు. **"మేమందరము అపవిత్రులవంటి వారమైతిమి, మా నీతి క్రియలన్నియు మురికి గుడ్డవలె నాయెను".** (యెషయా 64:6)

సృష్టికర్తయైన దేవునికి దూరంగా ఉండి మనము చేసే దానధర్మాలు మొదలైన నీతి క్రియలు ఆయన దృష్టికి మురికి గుడ్డవలె ఉన్నవి. యేసును నమ్మిన తరువాత ఆయన ప్రేమకు ప్రభావితమై ఇతరులను ప్రేమించి తప్పక సహాయము చేస్తాము. అయితే మనము మన నీతి క్రియల వలన దేవునిని చేరుకోలేము. మనం చేసే కొన్ని మంచి పనులు కొండంత ఉన్న మన పాపములను ఎప్పటికీ కొట్టివేయలేవు. భ్రమలో ఉన్న నన్ను దేవుని వాక్యము విడిపించింది. నాకు దేవుడు నేర్పించిన ఈ సత్యములు చాలా మందితో పంచుకున్నాను. విన్నవారు చాలా మంది ఆశ్చర్య పడ్డారు.

యెషయా గ్రంథము 53:4-6లో **"నిశ్చయముగా ఆయన (యేసుక్రీస్తు) మన రోగములను భరించెను. మన వ్యసనములను వహించెను.... ఆయన పొందిన దెబ్బల**

**(గాయముల) చేత మనకు స్వస్థత కలుగుచున్నది".** అని వ్రాయించిన ప్రభువు, గతములో యూరిన్ ఇన్‌ఫెక్షన్ నుండి బాగు చేసిన కృప గల యేసు క్రీస్తు నా జీవితంలో మరొక అద్భుతము జరిగించారు. ఒకసారి మా సంఘము యొక్క వార్షికోత్సవపు ప్రార్థనకు వెళ్ళాను. ఆ ప్రార్థనలో షుమారు 2000 మంది కూర్చుని యున్నారు. ప్రార్థన చేస్తున్న దేవుని సేవకుడు ప్రార్థన మధ్యలో ఈ విధంగా పలికారు: **"ఇక్కడ కూర్చునియున్న వారిలో ఒకరు తల నొప్పితో చాలా బాధపడుతున్నారు, దేవుడు ఇప్పుడు తనను బాగు చేస్తున్నారు"** అని పలికాడు.

ఈ సాక్ష్యములో ఇంతకు ముందు తెలిపియున్న ప్రకారము నేను తలనొప్పితో చాలా బాధపడుతూ ఉండేవాడిని. 365 రోజులు తలనొప్పి ఉండేది. ఇప్పుడు దేవుడు ఇచ్చిన ఈ వాక్కు నాకొరకేనని అర్థం కాలేదు. 2000 మందిలో ప్రభువు శక్తి ఎవరిని తాకిందో అనుకున్నాను. ఎందుకంటే ఆ సమయంలో కూడా నేను చాలా తలనొప్పితో ఆ ప్రార్థనలో కూర్చుని యున్నాను. యేసు క్రీస్తు నామమునకు మహిమ కలుగును గాక. ఆ మరునటి దినము నుండి తలనొప్పి బాధ మాయమైపోయింది. నా జీవితంలో ఇది ప్రభువు

జరిగించిన గొప్ప స్వస్థత కార్యము. యేసు క్రీస్తు తెలియక ముందు స్వస్థత కోసం మరియు మనశ్శాంతి కోసం చాలా చోట్ల వెదికాను. చాలా మార్గము లలో నడిచాను. అవన్నీ కూడా ఎండమావులు అని తెలుసు కున్నాను. కానీ యేసు క్రీస్తును నమ్మి ఆయనను వెంబడిం చిన తరువాత ఎన్నడు వెనుకకు చూడలేదు.

యోహాను 6:35-36లో యేసు ఈ విధంగా సెలవిచ్చారు. **"జీవాహారము నేనే నా యొద్దకు వచ్చువాడు ఏమాత్రమును ఆకలిగొనడు. నాయందు విశ్వాసముంచు వాడు ఎప్పుడును దప్పిగొనడు"** అని వ్రాయబడిన ప్రకారము ఆయన నా ఆత్మీయ ఆకలిని తీర్చారు. నా దాహమును తీర్చి నా ప్రాణమునకు సేద తీర్చారు.

**"ప్రయాసపడి భారము మోయుచున్న సమస్త జనులారా నాయొద్దకు రండి నేను మీకు విశ్రాంతిని కలుగ జేయుదును"** (మత్తయి 11:28) అని వాగ్ధానము చేసిన క్రీస్తు నా ప్రాణమునకు విశ్రాంతి అనుగ్రహించారు.

యేసు క్రీస్తు యొక్క రక్షణలోకి రాకముందు వెన్నెముక ఆపరేషన్ అయి చక్రాల కుర్చీకి పరిమితమయినపుడు భవిష్యత్తు గురించిన భయము కమ్ముకొని ఉండేది. ఆ

భయానికి ముఖ్య కారణము నా బాగోగులు ఎవరుచూస్తారు అని! ఇప్పుడు నాతో పాటు ఉన్న నా తల్లిదండ్రులు మరియు తోబుట్టువులు ఎల్లకాలము నాతో ఉండరు కదా! నేను ఊహించినట్లుగానే ఒక్కొక్కరు కొద్ది కాలములోనే దూరమై పోయారు. నేను ప్రభువును నమ్మిన కొద్ది కాలమునకు మా అమ్మమ్మగారు మరణించారు. చెల్లికి వివాహం అయి వెళ్ళిపోయింది. తమ్ముడు పై చదువుల కొరకు ఆమెరికా వెళ్ళిపోయాడు. మా నాన్నగారు విజయవాడ వెళ్ళిపోయారు. కొంత కాలము నాతో పాటు ఉన్న తరువాత తనకు అనుగుణంగా నేను ఉండడం లేదని మా అమ్మగారు కూడా నన్ను ఒంటరిగా వదిలి విజయవాడ వెళ్ళిపోయారు. రెండున్నర సంవత్సరములు నేను ఒక్కడినే అనగా ఇమ్మాను యేలుగా (దేవుడు మనకు తోడు) పిలువబడిన యేసుక్రీస్తే తోడుగా జీవించాను. ఎటువంటి శ్రమ గాని, కష్టము కానీ, అనారోగ్యము కాని రాకుండా నన్ను ప్రభువు కనుపాపవలె కాపాడారు. 'నన్ను ఎవరు చూచుకుంటారని' భయపడ్డావు కదా! నిన్ను ప్రేమించే నీ సృష్టికర్తయైన దేవుడను **"నేను నేనే నిన్ను ఆదరించు వాడను"** అని ప్రభువు నాకు ఋజువు చేశారు. అంతే కాకుండా నడవలేక చక్రాల కుర్చీలో ఉన్న కుమారుడిని వదిలి ఏ తల్లికూడా ఉండలేదు. కానీ మా అమ్మగారు

నన్ను విడచి వెళ్ళి పోయారు. అయితే ఇవన్నీ నా మేలు కొరకే జరిగాయి. దేవునికి ఇంకా దగ్గర అయ్యాను. యెషయా 49:15, 16లో దేవుడు చేసిన వాగ్దానము "**స్త్రీ తన గర్భమున పుట్టిన బిడ్డను కరుణింపకుండ తన చంటి పిల్లను మరచునా? వారైన మరచుదురు గాని నేను నిన్ను మరువను. చూడుము నా అరచేతుల మీదనే నిన్ను చెక్కియున్నాను నీ ప్రాకారములు నిత్యము నా యెదుట ఉన్నవి**" నా జీవితంలో అక్షరాలా నెరవేరింది.

మా చెల్లికి పెళ్ళి సంబంధములు చూచే దినములలో మా ఇంటికి వచ్చిన వారికి నన్ను పరిచయం చేయుటకు మా తల్లిదండ్రులు చాలా సార్లు ఇష్టపడేవారు కాదు. కొన్ని సార్లు ఆఫీసులోనే ఎక్కువ సేపు ఉండిపోయి మా చెల్లెలిని చూచుకోవడానికి వచ్చిన వారు వెళ్ళిపోయిన తరువాత నేను ఇంటికి చేరుకునే వాడిని. చదువుకునే రోజులలో వచ్చిన మంచి మార్కులను బట్టి మరియు చిన్న వయసులోనే వచ్చిన బ్యాంకు ఉద్యోగమును బట్టి ఒకప్పుడు ఎంతో గర్వంగా నన్ను మా తల్లిదండ్రులు అందరికీ పరిచయం చేసేవారు. కానీ నడువలేకుండా ఉన్న నన్ను తమ కుమారుడిగా చెప్పుకొనుట నామోషిగా భావించసాగారు. అయితే సృష్టికర్త యైన దేవుడు, ఆకాశమహాకాశములు పట్టజాలనటు వంటి

యెహోవా దేవుడు ఆయన కుమారుడయ్యే అధికారము ఇచ్చారు. నన్ను తన కుమారునిగా చేసుకొని తన కుమారుని ఆత్మను నాకిచ్చి క్రీస్తు తోడి వారసత్వము నాకిచ్చారు. నన్ను తన కుమారునిగా చెప్పుకొనుటకు మరియు ఆయన నా తండ్రియని నా దేవుడని చెప్పుకొనుటకు ఇష్టపడుచున్నారు. ఎంత గొప్ప భాగ్యము? (యోహాను 1:12, రోమా 8:15-17)

యేసు క్రీస్తు నా జీవితంలో చేసిన ఇంకొక అద్భుతము గురించి మీతో పంచు కోవాలని ఆశపడుతున్నాను. మా చెల్లెలి వివాహ సమయంలో ఇల్లంతా చుట్టాలతో వారి బ్యాగులతో నిండిపోయింది. నాకు బైబిలు చదువుకొనుటకు, ప్రార్థన చేసుకొనుటకు ఎక్కడా స్థలము లేక బాల్కనీలోకి వెళ్ళాను. మా బాల్కనీ దగ్గరలో ఒక చెట్టు ఉంది. ఆ దినములలో నేను మత్తయి సువార్త ధ్యానించు చున్నాను. మత్తయి 6:25, 26 వచనములలో ప్రభువు ఏమని బోధిస్తారంటే **"ఏమి తిందుమో, ఏమి త్రాగుదుమో అని మీ ప్రాణమును గూర్చి అయిననూ ఏమి ధరించుకొందుమో అని మీ దేహమును గూర్చి యైననూ చింతింపకుడి. ఆహారముకంటే, ప్రాణము, వస్త్రము కంటే దేహమును గొప్పవి కావా? ఆకాశ పక్షులను**

**చూడుడి. అవి విత్తవు, కోయవు కొట్లలో కూర్చుకొనవు. అయిననూ మీ పరలోకపు తండ్రి వాటిని పోషించు చున్నాడు. మీరు వాటి కంటే బహు శ్రేష్టులు కారా".** ఈ వచనములను చదివి ధ్యానిస్తూ తల పైకెత్తాను. బాల్కనీకి దగ్గరగా ఉన్న కొమ్మ మీద ఒక పావురము వ్రాలి ఒక చిన్న పండును నోట కరచుకొని ఎగిరిపోయింది. చాలా ఆశ్చర్య పోయి తలవంచు కొని మళ్ళీ అవే వచనములను చదివి ప్రభువు చెప్పిన మాటలను మననం చేసుకుంటూ మరోసారి తల ఎత్తాను. ఈ సారి ఒక గోరువంక అదే కొమ్మ మీద వ్రాలి ఇంకొక చిన్న ఎర్రని పండును తీసుకొని వెళ్ళి పోయింది. గొప్ప అనుభూతికి లోనై తలవంచి ఆ రెండు వచనములను మళ్ళీ చదివాను. ఈ సారి తల ఎత్తినపుడు ఒక ఆకు పచ్చని చిలుక ఆ కొమ్మ మీద వ్రాలి ఇంకొక పండును ముక్కున పెట్టుకొని వెళ్ళి పోయింది. నా ఆనందానికి అవధులు లేవు. ఆకాశమును, నక్షత్రములను, భూమిని సముద్రములను వాటిలోని సమస్తమును, నన్ను సృష్టించిన ఆ పరలోకపు తండ్రి బైబిలులో వ్రాయించిన మాటలను నా కళ్ళ ఎదుటే జరిగిస్తూ చూడు నా కుమారుడా! ఆ పక్షులను పోషించు చున్న నేను వాటికంటే శ్రేష్టమైన నిన్ను పోషించలేనా? నీవు భయపడవద్దు అని నాకు అనుగ్రహించిన ఈ ప్రత్యక్షత

కొరకై దేవునికి వేవేల వందనాలు. ఇటువంటి ప్రత్యక్షతలు చాలా అరుదు. ఈ కార్యమును నా యెడల జరిగించి తాను నన్ను ఎంత ప్రేమిస్తున్నారో యేసు ప్రభువు మరొకసారి ఋజువు చేసుకున్నారు.

**శాశ్వతమైన ప్రేమతో ప్రేమించే మన ప్రభువు :**

తన స్వరూపములో నన్ను చేసుకొని, నేను నరకమును తప్పించుకొని పరలోకమును పొందుకొనుటకు తన రక్తముతో నా పాపమంతటిని కడిగిన యేసుక్రీస్తుతో సహవాసము కలిగియుండే ధన్యత కలిగింది. ఆయనను పూర్ణ హృదయముతో ప్రేమించాలని సేవించాలని చాలా ఆశపడేవాడిని కానీ పొరపాట్లు జరుగుతూ ఉండేవి. ఒక సమయంలో ఆయనకు తగినట్లుగా జీవించలేక పోతున్నా ననే వ్యధ అంతకంతకు ఎక్కువ కాసాగింది. దేవుడు నన్ను విడిచిపెట్టేస్తాడేమో, నాకు దూరముగా వెళ్ళిపోతారేమోఅన్న ఆలోచనలు నన్ను చాలా కృంగదీసాయి. అటువంటి స్థితి గుండా నేను వెళ్తున్నప్పుడు ఒకరోజు **"యేసు పిలచు చున్నాడు"** అనే మ్యాగజైను పోస్టులో వచ్చింది. ఆ పుస్తకము పై అట్ట మీద ఈ వచనము ప్రింటు చేయబడి ఉంది. **"పర్వతములు తొలగిపోయినను మెట్టలు తత్తరిల్లినను నా కృప నిన్ను విడిచిపోదు. సమాధాన**

**విషయమైన నా నిబంధన తొలగిపోదు అని నీ యందు జాలిపడు యెహోవా సెలవిచ్చుచున్నాడు".** (యెషయా 54:10) ఇది చదివిన వెంటనే నాలో ఉన్న భారమంతా తొలగిపోయింది. దేవుడు నన్ను విడిచిపెట్టి వెళ్ళిపోతారేమో అని భయపడుతున్న నాతో దేవుడు మాట్లాడి పర్వతములు తొలగిపోయినను నా కృప నిన్ను విడిచిపోదు అని వాగ్దానము చేసి నన్ను ఎంతగానో ఆదరించారు. యేసు క్రీస్తు రక్తము ద్వారా నా రక్షణ మరియు నిత్య జీవము విషయమై ఆయన చేసిన నిబంధన ఎప్పటికీ తొలగిపోదు అనియు మరియు ఆయన నాయందు జాలిపడుతున్నా రనియు, నాయందు సంతోషించు చున్నారనియు ఆయన పలికిన మాటలు నన్ను తిరిగి ఆయన మార్గములలో నిలబెట్టాయి. మనలను ఏ మాత్రమును విడువని ఎన్నడును ఎడబాయని ఆ ప్రభువు ఋణమును మనము ఎప్పటికీ తీర్చలేము.

మా అమ్మగారు కూడ నన్ను విడచి విజయవాడ వెళ్ళిపోయిన తరువాత నేను నివసిస్తున్న గృహమును పవిత్ర పరచుకొన్నాను. ఈ గృహమును 24 సం॥ వయసులో నేను ప్రభువును నమ్ముకొనక ముందే దేవుడు నాకు అనుగ్రహించారు. అది నా పేరు మీద ఉంది.

లేకపోయినట్లైతే బహుశా నా కుటుంబ సభ్యులు నేను వారి మాటకు వ్యతిరేకముగా ప్రభువును వెంబడించు చున్నందుకు ఇంట్లో నుండి వెళ్ళిపొమ్మని అనేవారేమో. జరుగబోయేది కూడ ముందే తెలిసిన దేవుడు ఈ విషయంలో ఎంతో సహాయము చేసి నాకు మంచి ఉద్యోగమును మంచి గృహమును అనుగ్రహించి నా కాళ్ళ మీద నేను నిలువబడేటట్లు చేశారు.

**అద్భుత రీతిలో ప్రభువు జరిగించిన నా వివాహము :-**

ఒకసారి మా అమ్మగారు విజయవాడ నుండి నాకు చాలా దు:ఖముతో ఫోను చేసి నా వివాహము గురించి మాట్లాడసాగింది. నా తల్లిదండ్రుల వయసు పైబడుతుంది కాబట్టి వాళ్ళను చూసుకోవడానికి ఒక మనిషి కావాలి కాబట్టి నన్ను వెంటనే పెళ్ళి చేసుకోమని గొడవ చేయసాగింది. వారి కులమునకు చెందిన సంబంధములు చూసి నన్ను బలవంతం చేయసాగారు. నాకు ఉన్న పరిస్థితిని బట్టి నేను వివాహము చేసుకోకుండ ఉండిపోవాలని నిర్ణయించుకున్నాను. ఒకవేళ చేసుకుంటే ప్రభువును నమ్ముకున్న వ్యక్తినే చేసుకోవాలి అని మనస్సు స్థిరపరచుకున్నాను. ఎందుకంటే "విశ్వాసికి అవిశ్వాసితో పొత్తు లేదు" అని బైబిలులో వ్రాయబడి ఉంది. ఆ రోజు మా అమ్మగారితో ఫోనులో మాట్లాడిన తరువాత ప్రభువు

సన్నిధిలో ప్రార్థించాను. నా వివాహము విషయంలో దేవుని చిత్తం కొరకు మొఱ్ఱపెట్టాను. మన ప్రార్థనలకు ప్రత్యుత్తరమిచ్చేటటువంటి ప్రభువు వాక్యం ద్వారా నాతో మాట్లాడి నేను వివాహము చేసుకొనుటయే తన చిత్తమని నాకు తెలియచేశారు. నడువలేని స్థితిలో ఉన్న నేను ఎవ్వరిని కూడ వివాహము చేసుకొనమని అడుగలేను గనుక ప్రభువా మీరు ఎవరినైతే నా కొరకు సిద్ధపరిచారో వారే తమంతట తాము నన్ను వివాహము చేసుకొంటానని అడుగునట్లు దయచేయుమని ప్రార్థించాను.

ఈ ప్రార్థన దేవునికి నాకు తప్ప మరి ఎవరికినీ తెలియదు. ఆశ్చర్య రీతిగా నేను ఈ ప్రార్థన చేసుకున్న 3 వారములలోపే ఒక రోజు మా పాస్టరుగారు మా ఇంటికి వచ్చి "మూర్తీ, మన చర్చికి వచ్చే ఒక అమ్మాయి నిన్ను వివాహము చేసుకోవడానికి ఇష్టపడుతున్నది" అని చెప్పి తన వివరాలు ఇచ్చి వెళ్ళారు. నమ్మశక్యము కాని కార్యమును దేవుడు నా యెడల జరిగించారు.

ఇదంతా కూడా ప్రభువు ఏ విధముగా జరిగించారంటే ఉన్నత విద్యనభ్యసించినటువంటి తమ కుమారునికి పెండ్లి సంబంధములు చూచుచున్న ఒక కుటుంబము మా పాస్టరుగారిని కలిసి మా సంఘంలో తమకు సరిపోయే

వారు ఎవరైనా ఉంటే వారి వివరములిమ్మని వచ్చారు. మా పాస్టరుగారు బాగుగా చదువుకున్నటువంటి ఫ్లోరీని పిలిచి జరిగినది చెప్పి తన ఫోటో మరియు తన వివరములు ఇవ్వమని అడిగారు. అయితే దీనికి కొన్ని దినముల ముందే ప్రభువు ఫ్లోరీతో మాట్లాడి **"నీవు నా కుమారుడైన మూర్తిని వివాహము చేసుకుంటావా"** అని అడిగారు. దేవుని ఇష్టమునకు లోబడినటువంటి ఫ్లోరీ మా పాస్టరుగారు తన వివరములను అడిగినపుడు "నేను మూర్తిని వివాహము చేసుకుంటాను" అని చెప్పింది. సంభ్రమాశ్చర్యములకు గురి అయినటువంటి పాస్టరు గారు దేవుని నడిపింపు కొరకు మూడు దినములు ఉపవాస ప్రార్ధన చేయగా "ఈ వివాహమునకు నేను దిగి వచ్చుచున్నాను" అని ఆ పరలోకపు తండ్రి సెలవిచ్చారు. ఈ విధంగా 1997వ సంవత్సరము జనవరి / ఫిబ్రవరి నెలలో మా వివాహము నిశ్చయింపబడింది. కానీ ఇరువైపుల కుటుంబసభ్యులు చాలా వ్యతిరేకించారు. ఈ వివాహము జరుగదేమో అన్నంతగా పరిస్థితులు మారిపోయాయి. అయితే ప్రభువు నాతో మాట్లాడి "జూన్ నెల 5వ తారీఖున మీ వివాహము జరుగుతుంది" అని తెలియజేశారు. ఆ దినము సమీపించు కొలది దేవుడు పరిస్థితులను చక్కబరచి ఆయన వాగ్ధానము చేసిన రీతిగా

ఆయన చేతుల మీదుగా ఆయన సన్నిధిలో ఆయన నామమునకు ఘనత తెచ్చే విధంగా మా వివాహము జరిగింది. మొదటి నుండి చివరి వరకు మా పాస్టరుగారు ఎంతో బాసటగా నిలిచారు. పెండ్లి పనులన్నీ కూడా మా సంఘ సభ్యులే భుజాన వేసుకున్నారు. మా కాపరి గారికి మరియు సహాయము చేసిన వారందరికీ కృతజ్ఞతలు చెల్లిస్తున్నాను.

చదువులో గాని, రూపములో గాని, ఉద్యోగములో గాని, ప్రవర్తనలో గాని ఏ కొదువ లేని భార్యను సాటియైన సహాయముగా నాకు అనుగ్రహించి ఆయన నమ్మదగిన దేవుడని మరోసారి ఋజువు చేసుకున్నారు.

**మనుష్యులందరు ఎందుకు మరణించాలి:**

యేసుక్రీస్తును, పరిశుద్ధ గ్రంథమును నేను ఎరుగక మునుపు ఒక ప్రశ్నకు నాకు ఎక్కడా సమాధానము దొరుకలేదు. “ఈ భూమిమీద పుట్టిన ప్రతి ఒక్కరు ఎందుకు మరణించాలి? శరీర అవయములు అన్నీ బాగుగా పనిచేస్తూ కనీసం ఒక్కరైనా చావు లేకుండా జీవిస్తూ ఉండవచ్చు కదా?” అనేది.

దీనికి సమాధానం బైబిలులో ఉంది. **“ఒక మనుష్యుని (ఆదాము) ద్వారా పాపమును, పాపము ద్వారా మరణము**